పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తాం

సీఎం బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్

అడ్డగుట్ట: పేద విద్యార్థులకు బాసటగా నిలిచి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ శుక్రవారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్పాహారాన్ని విద్యార్థులకు వడ్డించి తాను కూడా వారితో పాటు కలిసి తిన్నారు. అనంతరం, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మాట్లాడుతూ పేద విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం నిరంతరం తనవంతు కృషి చేస్తుందన్నారు. కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి, డీసీ సుధాంశు, ఈఈ ఆశలత, స్కూల్ ప్రిన్సిపల్ మదన్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, పెండెం మనోహర్, పొన్నాల రాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం స్కూల్‌లో ..

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం బొల్లారం ప్రభుత్వ బాలికల పాఠశాల్లో శుక్రవారం బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జే. లోక్‌నాథ్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సంజీవ్, టీఆర్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. షెడ్రక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. రిసాలబజార్ హైస్కూల్ హెచ్ఎం శివప్రసాద్, బాల్‌రాజ్ తదితరులు విద్యార్థులతో కలసి అల్పాహారాన్ని తిన్నారు.



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

చాలా రుచికరంగా ఉంది : వెన్నల, 10వ తరగతి విద్యార్థిని



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అల్పాహార పథకం ద్వారా వచ్చిన ఆహారం రుచికరంగా ఉంది. చాలా మంది విద్యార్థులు ఇళ్లలో సమయం కుదరకపోవడంతో టిఫిన్ చేయకుండా స్కూల్‌కు వస్తుంటారు. అటువంటి వారికి ఈ పథకం ద్వారా మంచి అల్పాహారం లభిస్తుంది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వాళ్లు ఉదయం ఇంట్లో తినకుండానే స్కూల్‌కు వస్తుంటారు. వీరికి కూడా ఆల్పాహార పథకం ఎంతో దోహదపడుతుంది.

రోజుకొక వెరైటీ బాగుటుంది : మెహవీన్, 10వ తరగతి విద్యార్థిని



స్కూల్‌లో అల్పాహార పథకం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు మంచి ఆహారం అందుతుంది. ప్రతీ రోజు ఒకటే టిఫిన్ కాకుండా ఇడ్లి, పూరి, ఉప్మ, మిల్లట్ ఇడ్లీ, ఉగ్గని పోహా, పొంగల్ వంటివి రోజుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయడం చాలా బాగుంది. ఉదయాన్నే ఉరుకులు పరుగులతో ప్రభుత్వం స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులకు ఇంట్లో ఆల్పాహారం చేసే పని అమ్మకు తప్పుతుంది.

ఫార్మా పరిశ్రమలు కాలుష్యంపై దృష్టి సారించాలి



సీఎస్ఐఆర్-నీరి సదస్సులో పాల్గొన్న వక్తలు

సనత్‌నగర్: ఫార్మాసుటికల్స్ పరిశ్రమల్లో ఉత్పన్నమయ్యే పర్యావరణ సమస్యలపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని బాసర ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ స్పష్టం చేశారు. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఐఆర్-నీరి) హైదరాబాద్ జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌లో శుక్రవారం 'ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పర్యావరణ సవాళ్లు: సుస్థిర నిర్వహణ విధానం' (ఈసీపీఐ 2023) అంశంపై ఒకరోజు జాతీయ స్థాయి సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరమణ మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల ద్వారా నీరు, వాయు, ఘన కాలుష్యం వెలువడుతుందన్నారు. ఆయా పరిశ్రమలు ఉన్న ప్రాంతంలో కాలుష్యం మరింతగా విస్తరించి అక్కడి నివాసితులు అనారోగ్యం బారిన పడే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి కృష్ణదాస్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో మరింత మెరుగైన మార్గాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. నిపుణులు చర్చించి అవసరమైన సూచనలు చేయాలన్నారు. సీఎస్ఐఆర్ఐ-నీరి హైదరాబాద్ జోనల్ హెడ్ డాక్టర్ షేక్ భాషా మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా నిపుణులు సూచించిన అంశాలతో నివేదికను అందజేసి ఫార్మా పరిశ్రమలకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దివిస్ లేబరేటరీస్ మాజీ డైరెక్టర్ మధుసూదనరావు, సీఎస్ఐఆర్-నీరి నాగపూర్ డైరెక్టర్ డాక్టర్ ఏఎస్ వైద్య, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ అమిత్ బన్సివాల్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని వార్డు అధ్యక్షుడు బి. కనకరాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కంటోన్మెంట్ మూడవ వార్డు అంబేద్కర్‌నగర్‌లో మహంకాళి జిల్లా కార్యదర్శి రామిరెడ్డి ఆధ్వర్యంలో వార్డు స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ అధిష్టానం టిక్కెట్ ఎవరికి కేటాయించినా సమష్టిగా పని చేసి అభ్యర్థిని గెలిపిస్తామని అన్నారు.

ఓయూ టెక్నాలజీ కాలేజీకి యూజీసీ అటానమస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీకి యూజీసీ నుంచి మరో పది సంవత్సరాలు అటానమస్ (స్వయంప్రతిపత్తి) గుర్తింపు లభించింది. శుక్రవారం ఈ సందర్భంగా కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు మాట్లాడుతూ కాలేజీ అటానమస్‌తో రిసెర్చ్ ప్రాజెక్టులకు అధిక నిధులతో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టుకునే అర్హత లభించిందన్నారు. అటానమస్ రాక కోసం కృషిచేసిన సిబ్బందని, అధ్యాపకులను అభినందించారు.

వైద్య సిబ్బంది గౌరవం పెరిగేలా ఉన్నతీకరణపై హర్షం

గాంధీఆస్పత్రి : ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బంది గౌరవం పెరిగేలా పోస్టుల పేర్లు ఉన్నతీకరణ చేస్తు తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై గాంధీ నర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గాంధీ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ (గేట్-1) మంగమ్మను ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కేంద్రప్రభుత్వం మార్చినట్లు తమ డిజిగ్నేషన్‌ను వివిధ హోదాల్లో పేర్లు మార్చాలనే నర్సింగ్ సిబ్బంది డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. స్టాఫ్‌నర్సు హోదాను నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్‌నర్సును సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌ను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, గ్రేడ్-1 పేరును చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా హోదాలు కల్పిస్తు తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల గాంధీ నర్సింగ్ సిబ్బంది సీఎం కేసీఆర్, వైద్య శాఖ మంత్రి హరీష్‌రావు, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, డీఎంఈ రమేష్‌రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజారావులకు కృతజ్ఞతలు తెలిపారు.



మంగమ్మను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ రాజారావు

ఓయూలో ముందస్తు అరెస్టులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు తొలిసారిగా మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక విద్యార్థి నేతలను కొందరిని ముందస్తు అరెస్టులు చేయగా మరికొందరిపై నిఘాపెట్టారు. శుక్రవారం ఓయూలో రూ.16 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డు శంకుస్థానకు ముఖ్యఅతిథిగా మంత్రి కేటీఆర్, ఇతర మంత్రులు హాజరుకావాల్సి ఉంది. కానీ ఓయూలో గొడవలు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారంతో కేటీఆర్‌తో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్సీలు, అధికారులు, చివరకు స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కూడా రాకపోవడంతో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి శంకుస్థాపన చేయించారు. కేటీఆర్ రాకపోవడంతో విద్యార్థి నేతలు, అధికారులు నిరాశ చెందారు.

పికెట్ గార్డెన్‌లో దివ్య కళా మేళా ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: పికెట్ గార్డెన్‌లోని ఓపెన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 'దివ్య కళా మేళా'ను కేంద్ర సహాయ మంత్రి ప్రతిమా భౌమిక్ ప్రారంభించారు. ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రారంభించిన ఈ మేళాలో ప్రజా చైతన్య ప్రచారానికి ప్రతిమా భౌమిక్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రతిమా భౌమిక్ మాట్లాడుతూ.., వికలాంగులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, స్వయం స్వావలంబన నవభారత నిర్మాణంలో వికలాంగుల పాత్ర కీలకమైనదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల కేటగిరీలను 7 నుంచి 21కి పెంచిందన్నారు. పదిరోజుల పాటు జరిగే ఈ మేళాలో డైస్లెక్సియా, సెరిబ్రల్ పాల్సీ, మానసిక ఆరోగ్యం, దృష్టి లోపం, మరుగుజ్జు, పక్షవాతం తదితర సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ స్పీకర్

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ శుక్రవారం పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలులో సికింద్రాబాద్ అగ్రస్థానంలో ఉందన్నారు. సీతాఫల్‌మండిని ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు వివరించారు.

అట్టహాసంగా మంత్రి తలసాని జన్మదిన వేడుకలు



పద్మారావునగర్‌లో అన్నదాన కార్యక్రమం



గాంధీ ఆసుపత్రి ముందు కేక్‌కట్ చేసిన పవన్‌కుమార్ గౌడ్



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేయడంతో పాటు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పద్మారావునగర్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ అధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. పద్మారావునగర్ పార్కు వద్ద బీఆర్ఎస్ నాయకులు ఇ. శ్రీనివాస్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ ఆసుపత్రి ముందు ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ అధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జి. పవన్‌కుమార్ గౌడ్ హాజరై భారీ కేక్ కట్ చేశారు. పద్మారావునగర్ స్కందగిరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కె. హేమలత కేక్‌కట్ చేశారు.



విజయ డెయిరీలో మంత్రి జన్మదిన వేడుకలు

లాలాపేట: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను శుక్రవారం లాలాపేటలోని విజయ డెయిరీలో ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం విజయ డెయిరీ చైర్మెన్ సోమ భరత్‌కుమార్ మంత్రిని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు.

మంత్రి జన్మదినం సందర్భంగా అన్నదానం

సనత్‌నగర్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదినం సందర్భంగా బీకేగూడ శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సిటిజన్ డాక్టర్ శేష గిరిరావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 400 మందికి అన్నదానం చేశారు. సేవా సమితి ట్రస్టీ పార్థసారథి, మామిడి రామమూర్తి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, విఠల్‌రెడ్డి, సుజాతమ్మ, రజనీరెడ్డి, అరవింద్‌గౌడ్, కృష్ణదేవగౌడ్, రాజేందర్, ఎల్‌వీఆర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి డిప్యూటీ మేయర్ శుభాకాంక్షలు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను పురష్కరించుకుని శుక్రవారం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, బిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డిలు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

అమీర్‌పేట : రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఆవరణలో పునరుద్ధరించిన అద్దాల మండపాన్ని ప్రారంభించారు. అలాగే.. బల్కంపేటలో ఉదయం మంత్రి తలసాని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.వేడుకలకు మంత్రి హాజరై కేక్‌ను కట్ చేశారు.



ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా కాంగ్రెస్ పథకాలు



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మర్రి ఆదిత్యారెడ్డి

సనత్‌నగర్: తుక్కుగూడ కాంగ్రెస్ విజయభేరి సభలో పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆ పార్టీ మేనిఫెస్టో సభ్యులు మర్రి ఆదిత్యారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సనత్‌నగర్, బేగంపేట డివిజన్లలో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి ఆరు గ్యారెంటీ పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మర్రి ఆదిత్యారెడ్డి మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా ఇంటింటికీ వెళ్లి పార్టీ హామీనిచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల గురించి వివరిస్తుంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ జబ్బార్ కాంప్లెక్స్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముందు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 8 ఆదివారం సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు డాకి అశోక్, కోటి, కబీర్‌దాస్, యాదగిరి, రాములు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

హుండీ ఆదాయం రూ.3.99 లక్షలు



సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవిల సమక్షంలో ఆలయ ప్రాంగణంలోని అన్ని దేవాలయాలకు సంబంధించిన హుండీల కానుకలను లెక్కించారు. మొత్తం హుండీ ఆదాయం రూ.3,99,878ల ఆదాయం భక్తుల కానుకల ద్వారా లభించినట్లు ఈ సందర్భంగా ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, గోపాల్‌జోషి, విజయేంద్ర, సుదర్శనాచార్యులు, రిపుంజయశర్మ, వెంకటేష్, ప్రకాశం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక తాడోపేడో తేల్చుకుంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ విషయంతో ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామని ఆమరణ దీక్ష శిబిరంలో కాంట్రాక్టు అధ్యాపకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గల బస్టాండ్ వద్ద వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కుమార్, రామేశ్వర్‌రావు మాట్లాడుతూ గత 157 రోజులుగా పెన్‌డౌన్ చాక్‌డౌన్‌తో పాటు అనేక ఆందోళన కార్యక్రమాలు, మంత్రులకు, ఉన్నత విద్య మండలి అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇతర కాలేజీల అధ్యాపకులను పర్మనెంట్ చేసి కేవలం వర్సిటీలలో పని చేస్తున్న 1445 మంది అధ్యాపకులను విస్మరించడం బాధకరమన్నారు.అమరణ దీక్షలో శ్రీధర్‌కుమార్, రామేశ్వర్‌రావు, రాజేష్‌ఖన్నా, దత్తహరి,వెంకటేశ్వర్లు పాల్గొనగా సుమారు 500 మంది అధ్యాపకులు హాజరై సంఘీభావం తెలిపారు.

కంటోన్మెంట్‌లో 39వేల బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న అధికారులు



కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో 39వేల బతుకమ్మ చీరల పంపిణీ చేయనున్నట్లు మెప్మా అధికారి ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగానే నియోజకవర్గ వ్యాప్తంగా నిర్దేశించిన 31 కేంద్రాల్లో పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. గత బుధవారం నుంచే చీరల పంపిణీ ప్రారంభించామని, ఈ నెల 13వ తేదీ వరకు నిర్విరామంగా కొనసాగుతుందని వెల్లడించారు.

సుభాష్‌నగర్‌లో చీరల పంపిణీ

అమీర్‌పేట : రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదినం సందర్భంగా సుభాష్‌నగర్‌లోని శ్రీ దుర్గా సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అదే విధంగా కైలాష్‌నగర్‌లో మల్టీ పర్పస్ కమ్యూనిటీహాలు నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బోగి బాల్‌రాజ్, కేఎల్ఎస్ పార్కు చైర్మన్ షాబాద్ శ్రీనివాస్‌రావు,ఓం ప్రకాష్ శర్మ,చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చీరల వేలానికి విశేష స్పందన

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ అమ్మవారి చీరల వేలంకు విశేష స్పందన లభించింది. స్థానిక కార్పొరేటర్ సామల హేమ, ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, అండాల్ నేతృత్వంలో ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన వేలంపాటలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను దక్కించుకునేందుకు పలువురు భక్తులు పోటీ పడగా రెజిమెంటల్‌బజారుకు చెందిన నవీన్‌కుమార్ రూ.1.90 లక్షలకు అమ్మవారి చీరలను సొంతం చేసుకున్నారు.

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి

బన్సీలాల్‌పేట్: బీఆర్ఎస్ పాలనలో అప్పులు కుప్పలుగా పెరుకుపోయి తెలంగాణ అథోగతి పాలైయిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోటనీలిమ ఆరోపించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీ పథకాల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చి ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేశారన్నారు. మద్య ఏరులైపారుతుందని, మద్యం మహమ్మారీకి పేదలు బతుకులు చిన్నాభిన్నంగా మారాయన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నిస్తాయన్నారు.



డాక్టర్ కోట నీలిమ కాంగ్రెస్ అభయహస్తం పేరిట ప్రచారం

క్లుప్తంగా...

రేపటి నుంచి మాక్ పార్లమెంట్ సమావేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: సిటిజన్ ఇండియా, ఓయూ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో రేపటి (8న) నుంచి మూడు రోజుల పాటు సిటిజన్ యూత్ పార్లమెంట్ (మాక్ పార్లమెంట్) సమావేశాలు జరగనున్నాయి. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీసీ ప్రొ.రవిందర్, సిటిజన్ ఇండియా సీఈవో స్వాతిచంద్రశేఖర్ సమావేశాల వివరాలను వెల్లడించారు. మాక్ పార్లమెంట్ సమావేశాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 1800 దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా 18 నుంచి 40 ఏండ్లలోపుగల 180 మందిని ఎంపిక చేసిన్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఓయూ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు వసతి కల్పించనున్నట్లు చెప్పారు.

8న పరేడ్ గ్రౌండ్‌లో ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ

కంటోన్మెంట్: ముదిరాజ్‌లకు జనాభా దామాషా ప్రకారం సామాజిక, రాజకీయ అవకాశాలు దక్కాల్సిందేనని ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పిట్ల నాగేశ్ ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లు అంతా ఒక్కటై సత్తా చాటేందుకు ఈ నెల 8న పరేడ్ గ్రౌండ్స్ ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జేబీఎస్ ప్రాంగణంలోని కొర్వి కృష్ణస్వామి విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు.

కాంగ్రెస్ పార్టీ బన్సీలాల్‌పేట్ అధ్యక్షుడిగా చిరంజీవి



బన్సీలాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులుగా చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.

కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడిగా జీఎన్ అనిల్



బౌద్ధనగర్: కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా అనిల్ కుమార్ నూతనంగా నియామితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్ యాదవ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా అనిల్ మట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓయూ బైపాస్ రోడ్డు నిర్మాణంతో ఎంతో మేలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో త్వరలో నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డుతో ఎంతో మేలు జరుగుతుందని వీసీ ప్రొ.రవిందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డితో కలసి వీసీ బైపాస్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓయూ నుంచి నిర్మించతలపెట్టిన బైపాస్ రోడ్డు పై అపోహలు నమ్మవద్దన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సనత్‌నగర్: విస్తృత అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్టవేయవచ్చని సీసీపీఎస్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆర్‌జీ శివ మారుతి అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (ఫిక్కీ) అనుబంధ సంస్థ అయిన యువ మహిళా విభాగం (వైఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో బేగంపేట సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్‌జీ శివ మారుతి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సాంకేతికత ప్రతిఒక్కరి జీవితంలో అంతర్భాగమైందని, ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కూడా పెరిగిపోయారన్నారు. వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయన్నారు. సైబర్ నేరాల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సంబంధిత వివరాలను ఎక్కడా వెల్లడించవచ్చవద్దన్నారు.